
## మా బంధం అది కాదు

**నీరజ్‌తో పెండ్లి వార్తలపై మను స్పందన**

ఢిల్లీ: బల్లెం వీరుడు నీరజ్ చోప్రాను పెండ్లి చేసుకోబోతున్నానని వస్తున్న వార్తలపై యువ షూటర్ మను భాకర్ స్పందించింది. పారిస్ ఒలింపిక్స్ సందర్భంగా 'ఇండియా హౌస్' లో కలుసుకున్న ఈ ఇద్దరూ సన్నిహితంగా మాట్లాడుకోవడంతో ఈ చర్చ ఊపందుకున్న విషయం తెలిసిందే. తాజాగా దీనిపై మను ఓ టీవీ చానెల్‌తో మాట్లాడుతూ.. 'మా అమ్మతో నీరజ్ ఏం మాట్లాడనేది నాకు తెలియదు. ఎందుకంటే ఆ సమయంలో నేను అక్కడ లేను. కానీ నేను, నీరజ్ 2018 నుంచి పలు పోటీలు, ఈవెంట్స్‌లో కలుసుకుంటున్నాం. కాంపిటీషన్స్‌లలో కలుసుకున్నప్పుడూ సరదాగా తక్కువగానే మాట్లాడుకుంటాం. అంతే తప్ప మా ఇద్దరి మధ్య జనం అనుకుంటున్నట్టుగా ఏమీ లేదు' అని స్పష్టతనిచ్చింది.



*వినేశ్ ఫోగాట్ అప్పీల్‌ను తిరస్కరించిన కాస్*

# ఆశలు ఆవిరి

**భారత స్టార్ రెజ్లర్‌కు కోర్టులో చుక్కెదురు • తీర్పుపై ఐవోఏ చీఫ్ ఉష తీవ్ర అసంతృప్తి**

**భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ ఆశలు ఆవిరయ్యాయి. అధిక బరువుతో అనర్హత వేటుకు గురై వెండి పతకం కోసం వినేశ్ చేసిన అప్పీల్‌ను అంతర్జాతీయ క్రీడా న్యాయస్థానం(కాస్) అనూహ్యంగా తిరస్కరించింది. పలు వాయిదాల తర్వాత కాస్ అడ్‌హాక్ డివిజన్ బుధవారం వెలువరించిన తీర్పు భారత క్రీడాభిమానులను కలతకు గురిచేసింది. వినేశ్ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంటుందనుకున్న కాస్ సుదీర్ఘ వాదనల తర్వాత కఠిన నిబంధనలకు కట్టుబడుతూ నిర్ణయం తీసుకోవడంతో భారత్‌కు ఏడో పతకంపై 'ఏడు'పే మిగిలింది. కాస్ తీర్పుపై భారత ఒలింపిక్ సంఘం(ఐవోఏ) చీఫ్ పీటీ ఉష తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కనీసం మానవీయ విలువలకు కట్టుబడకుండా విజ్ఞప్తిని కాస్ తిరస్కరించిన తీరును తప్పుబట్టింది. పోరాటాన్ని అణువణువునా నింపుకున్న వినేశ్ ఫోగాట్ కాస్ తీర్పును సవాలు చేసే అవకాశముంది.**

పారిస్: యావత్ భారత జాతి మరికొన్ని గంటల్లో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ..క్రీడాభిమానులను నిరాశకు గురి చేసే వార్త ఇది. 100 గ్రాముల అధిక బరువుతో అనర్హత వేటుకు గురైన స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌కు అంతర్జాతీయ క్రీడా న్యాయ స్థానం(కాస్)లో ఉహించని రీతిలో చుక్కెదురైంది. వాయిదాల పడుతూ వచ్చిన తీర్పు వినేశ్‌కు వ్యతిరేకంగా వచ్చింది. బుధవారం కాస్ అడ్‌హాక్ డివిజన్ వినేశ్ విజ్ఞప్తిని తిరస్కరిస్తూ తీర్పునిచ్చింది. దీంతో కనీసం వెండి పతకం కోసమైనా పరిగణనలోకి తీసుకోవాలన్న ఫోగాట్ అప్పీల్‌ను కాస్ తోసిపుచ్చుతూ తీర్పు వెలువరించింది. ఈ కారణంగా పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ఏడో పతకం ఆశలు గల్లంతయ్యాయి. మంగళవారం నాడు కాస్ తీర్పును ఈ నెల 16కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. అయితే అనూహ్య పరిణామాల మధ్య కాస్ బుధవారం అప్పీల్‌ను తిరస్కరించినట్లు ఐవోఏ ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్(యూడబ్ల్యూడబ్ల్యూ), అంతర్జాతీయ ఒలింపిక్ సమాఖ్య(ఐవోసీ) కఠిన నిబంధనలకు కట్టుబడుతూ కాస్ తీర్పు వచ్చినట్లు తెలుస్తున్నది.

### సుదీర్ఘ వాదనల తర్వాత:

అధిక బరువుతో అనర్హత వేటుకు గురి కావడంతో వినేశ్ ఫోగాట్..అంతర్జాతీయ క్రీడా న్యాయస్థానం (కాస్)ను ఆశ్రయించింది. ఒలింపిక్స్‌లో ప్లేయర్ల సమస్యల పరిష్కారం కోసం పారిస్‌లో తాత్కాలికంగా కాస్ అడ్‌హాక్ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అన్నాబెల్లె బెన్నెట్..ఏకైక ఆర్బిట్రార్‌గా వ్యవహరించారు. ఈ కేసులో వినేశ్ ఫిర్యాదుదారు కాగా, యూడబ్ల్యూడబ్ల్యూ, ఐవోసీ ప్రతివాదులుగా ఉన్నాయి. అయితే ఈనెల 9న దాదాపు మూడు గంటల పాటు ఇరు పక్షాల మధ్య సాగిన సుదీర్ఘ వాదనలను అర్బిట్రార్ పరిశీలించారు. తొలుత ఫ్రెంచ్ లాయర్లు వినేశ్ వాదనలు వినిపించగా, భారత్‌కు చెందిన సీనియర్ లాయర్లు హరీశ్ సాల్వే, విదుష్పత్ సింఘానియాను ఐవోఏ నియమించింది. మంగళవారం జరిగిన వాదనల్లోనూ వినేశ్ అనర్హతకు సంబంధించి పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా బరువు అనేది అథ్లెట్‌కు ఉన్న ప్రాథమిక హక్కు. పోటీల తొలి రోజు నిర్దేశిత బరువు ప్రమాణాలకు అనుగుణంగానే ఆమె పోటీల్లో పాల్గొంది. మూడు బౌట్లలో పోటీ తర్వాత మరుసటి రోజు ఉదయం జరిగిన పరీక్షల్లో కేవలం 100 గ్రాముల తేడాతో అనర్హతకు గురైందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

### వినేశ్ అప్పీల్ ఏంటీ?

అనర్హతకు గురైన తర్వాత వినేశ్ ఫోగాట్ తనకు ఫైనల్లో పోటీపడే అవకాశం కల్పించాలని కాస్ అడ్‌హక్ డివిజన్‌ను అభ్యర్థించింది. అయితే కాలవ్యవధి తక్కువ ఉండటంతో ఫోగాట్ అప్పీల్‌ను కాస్ పరిగణనలోకి తీసుకోలేదు. ఈ నేపథ్యంలో నిర్దేశిత బరువు ప్రమాణాలతో ఫైనల్‌కు చేరుకున్న తనకు రజత పతకం ఇవ్వాలని కోరింది. 100 గ్రాముల అంశాన్ని కాకుండా మానవీయ కోణంలో నిర్ణయం తీసుకోవాలంటూ వినేశ్‌తో పాటు ఆమె తరపు లాయర్లు కాస్‌లో వాదించినా ఫలితం లేకపోయింది. ఇదిలా ఉంటే ఓవైపు ఫోగాట్ కేసు కాస్‌లో విచారణ జరుగుతుండగానే యూడబ్ల్యూడబ్ల్యూ చీఫ్ నెనాద్ లలోవిచ్‌తో పాటు ఐవోసీ చీఫ్ థామస్ బాచ్ 'రూల్ ఈజ్ రూల్' కుండబద్దలు కొట్టారు. నిబంధనల సడలింపు అనే దానికి ఎండ్ పాయింట్ ఎక్కడా లేదంటూ వ్యాఖ్యానించారు.

## అప్పీల్‌కు చాన్స్ ఉందా?

అధికారిక వెబ్‌సైట్ ప్రకారం కాస్‌లో తిరిగి వినేశ్ అప్పీల్ చేసేందుకు అవకాశమున్నప్పటికీ తీర్పు ఎలా వస్తుందనేది ఆసక్తికరంగా మారింది. కొన్ని పరిమితమైన అంశాల్లోనే స్విస్ ఫెడరల్ ట్రిబ్యునల్ కేసులను పరిశీలిస్తుంది. ముఖ్యంగా విచారణాధికారంలో లోపాలతో పాటు న్యాయపరమైన అంశాలు(ఉదాహరణకు నిష్పక్షపాత వాదనల్లో ఉల్లంఘనలు, పబ్లిక్ పాలసీకి అసంబద్ధంగా ఉండటం) ఉన్నప్పుడు కోర్టు కలుగజేసుకుంటుంది. వినేశ్ కేసు విషయంలో ఫ్రెంచ్ లాయర్లు జోయెల్లె మనోలిస్, ఎస్టెల్లె ఇవనోవా, హబైన్ ఎస్టెల్లె కిమ్, చార్లెస్ అమ్సన్ సహకరించారు. వీరికి తోడు భారత లాయర్లు హరీశ్‌సాల్వే, విదుష్పత్ సింఘానియా కేసులో వాదనలు వినిపించారు.



"దేశ క్రీడాలోకాన్ని తీవ్రంగా నిరుత్సాహరుస్తూ వినేశ్ ఫోగాట్ అప్పీల్‌ను కాస్ కొట్టిపడేయడం నిరాశకు లోనుచేసింది. తదుపరి న్యాయసంబంధ అంశాల్లో వినేశ్‌కు అన్ని విధాలుగా సహకరించేందుకు ఐవోఏ సిద్ధంగా ఉంది. కేవలం వంద గ్రాముల అధిక బరువుతో కేవలం వినేశ్ కెరీర్‌కే కాదు నిబంధనలు వాటి పర్యావసనాలు ప్లేయర్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. పోటీల రెండో రోజు నిర్ణీత బరువు కంటే ఎక్కువగా ఉండటాన్ని కారణంగా చూపుతూ వేటు వేశారు. చివరి నిమిషం వరకు అర్హత పొందేందుకు ప్రయత్నించిన వినేశ్ తీవ్ర మానసిక వేదనకు గురైంది. ఇది కేవలం వినేశ్ విషయంలోనే కాదు..మహిళా ప్లేయర్లను మానసికంగా ఒత్తిడి గురిచేసే అంశం. అర్హత విషయంలో అథ్లెట్లకు మరింత మెరుగైన నిబంధనలు తీసుకురావాల్సిన అవసరముంది.

**- పీటీ ఉష**

## కెన్యా హెడ్‌కోచ్‌గా దొడ్డ గణేశ్



నైరోబి: భారత క్రికెట్ జట్టు మాజీ ఆల్‌రౌండర్ దొడ్డ గణేశ్ కెన్యా జాతీయ జట్టుకు హెడ్‌కోచ్‌గా ఎంపికయ్యాడు. 51 ఏండ్ల ఈ కర్నాటక మాజీ ఆటగాడు భారత్ తరపున 4 టెస్టులు, ఒక వన్డే ఆడాడు. కానీ దేశవాళీ క్రికెట్‌లో కర్నాటకకు ఆడుతూ 365 వికెట్లు, 2వేల పరుగులు సాధించాడు. చాలాకాలంగా అంతర్జాతీయ క్రికెట్ రేసులో వెనుకబడిపోయిన కెన్యాను గణేశ్ ఏ మేరకు పోటీలోకి తెస్తాడనేది ఆసక్తికరం.

## రెజ్లర్ల పోరాటం వల్లే పతకాలు రాలేదు

*డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ సంజయ్ సింగ్*



ఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా గతేడాది రెజ్లర్లు చేపట్టిన ఆందోళన కారణంగానే ఈ ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు రెజ్లింగ్‌లో పతకాల సంఖ్య తగ్గిందని అధ్యక్షుడు సంజయ్ సింగ్ వ్యాఖ్యానించడం మరో దుమారానికి తెరలేపింది. ఇదే విషయమై ఇండియా టుడేతో సంజయ్ మాట్లాడుతూ.. 'ఈ అంశం(రెజ్లర్లకు పతకాలు తగ్గడంపై)ను మరో కోణంలో గమనిస్తే గతేడాది సుమారు 14-15 నెలల పాటు రెజ్లర్లు ఢిల్లీ వీధుల్లో ఆందోళనలతోనే గడిపారు. దీంతో నిరసనల్లో పాల్గొన్న వారితో పాటు ఇతర రెజ్లర్లూ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ కాలంలో వాళ్లు శిక్షణకు దూరమయ్యారు. జాతీయ, అంతర్జాతీయ టోర్నీలలోనూ పాల్గొనలేదు. అందుకే ఒలింపిక్స్‌లో మన రెజ్లర్లు ఆశించిన స్థాయిలో పతకాలు తీసుకురాలేదు. లేకుంటే రెజ్లింగ్‌లో భారత్‌కు మరిన్ని పతకాలు వచ్చుండేవి' అని వ్యాఖ్యానించాడు. రెజ్లింగ్‌లో భారత్‌కు అమన్ సెహ్రావత్ ఒక్కడే పతకం తీసుకురాగా 'అనర్హత వేటు' ఎదుర్కొన్న వినేశ్ ఫోగాట్ రజత పతకంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. కాగా గతేడాది బ్రిజ్ భూషణ్‌పై రెజ్లర్లు చేసిన పోరాటానికి వినేశ్ నేతృత్వం వహించిన విషయం విదితమే.

# మోర్కెల్ వచ్చేశాడు

**భారత బౌలింగ్ కోచ్‌గా సఫారీ మాజీ పేసర్ • పంతం నెగ్గించుకున్న గంభీర్**

**మోర్కెతో మూడేండ్ల ఒప్పందం • దులీప్ ట్రోఫీ నుంచే పని మొదలు**



ఢిల్లీ: దక్షిణాఫ్రికా మాజీ పేసర్ మోర్నీ మోర్కెల్ టీమ్‌ఇండియాకు బౌలింగ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి జై షా బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు. మాజీ బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే స్థానంలో మోర్కెల్ సేవలందించనున్నాడు. వచ్చే నెల 19న బంగ్లాదేశ్ టెస్టు సిరీస్‌తో మొదలయ్యే మోర్కెల్ ఒప్పందం.. మూడేండ్ల పాటు (2027 వన్డే వరల్డ్ కప్ ముగిసేదాకా) కొనసాగనుంది. సఫారీ మాజీ పేసర్ నియామకంతో హెడ్ కోచ్ గంభీర్ తన పంతాన్ని నెగ్గించుకున్నాడు. కోచ్‌గా నియమితుడయ్యేప్పుడే గంభీర్ తన సహాయక సిబ్బంది విషయంలో స్వేచ్ఛను ఇవ్వాలని కోరగా బీసీసీఐ అందుకు అంగీకారం తెలిపినట్టు వార్తలు వచ్చాయి. గౌతీ అనుకున్నట్టుగానే అసిస్టెంట్ కోచ్‌గా అభిషేక్ నాయర్, రియాన్ డస్కటె నియమితులు కాగా తాజాగా మోర్కెల్ సైతం బౌలింగ్ విభాగాన్ని పర్యవేక్షించనుండటం గమనార్హం. బంగ్లాతో టెస్టు సిరీస్‌కు ముందే ఎన్‌సీఏకు రానున్న మోర్కెల్.. దులీప్ ట్రోఫీలో బౌలర్ల ప్రదర్శనపై కన్నేయనున్నాడు.

### రోహిత్, కోహ్లీ, బుమ్రాకు మినహాయింపు

భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి క్రికెటర్లు సైతం దేశవాళీలో ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీ ఆడాలని ఆదేశాలిచ్చిన బీసీసీఐ.. సీనియర్ ప్లేయర్లు రోహిత్, కోహ్లీ, బుమ్రా, రవిచంద్రన్ అశ్విన్‌కు మినహాయింపునిచ్చింది. సెప్టెంబర్ 5 నుంచి జరుగబోయే తొలి రౌండ్ మ్యాచ్‌లకు గాను నాలుగు గ్రూపులుగా విభజించి ప్రకటించిన జట్లలో ఆ నలుగురిని ఎంపిక చేయలేదు.

## 'మీకంత సీన్ లేదు.. హ్యాట్రిక్ మాదే'

దుబాయ్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఈ ఏడాది నవంబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్న భారత జట్టు హ్యాట్రిక్ సిరీస్‌పై కన్నేసిందని, తప్పుకుండా దానిని సాధించి తీరుతుందని మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి అన్నాడు. ఈ సిరీస్ ప్రారంభానికి ఇంకా 3 నెలల సమయమున్నా రెండ్రోజుల క్రితం ఆసీస్ మాజీ సారథి రికీ పాంటింగ్ స్పందిస్తూ.. 'ఈసారి ఆస్ట్రేలియా 3-1తో సిరీస్ గెలుస్తుంది' అని జోస్యం చెప్పిన నేపథ్యంలో శాస్త్రి స్పందించాడు. 'బ్యాటింగ్, బౌలింగ్ విభాగంలో టీమ్‌ఇండియా చాలా పటిష్టంగా ఉంది. బుమ్రా, షమీ, సిరాజ్ జట్టులో ఉన్నారు. అశ్విన్, జడేజాతో పాటుగా బెంచ్‌లోనూ మెరుగైన బౌలర్లు భారత్ సొంతం' అని అన్నాడు.



*పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొని స్వదేశానికి తిరిగొచ్చిన భారత క్రీడాకారుల బృందంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన ముర్ము.. ఒక్కొక్కరితో మాట్లాడి ఒలింపిక్స్ విశేషాలు అడిగి తెలుసుకున్నారు.*